# రాయలసీమకు ఐదేళ్లు తీరని ద్రోహం జరిగింది : కేకే చౌదరి



**రైల్వే కోడూరు ప్రతినిధి ఫిబ్రవరి 4 (డ్రీమ్ టైమ్స్)** రాయలసీమకు ఐదేళ్లపాటు తీరని ద్రోహం చేసిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి ఆరోపించారు. ఇప్పుడు దీక్షల పేరుతో రాజకీయ నాటకాలు చేయడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని అన్నారు.

అమరావతి రూపకర్త, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 19 నెలల పాలనలోనే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.8 వేల కోట్లకు పైగా ఖర్చు చేశారని గుర్తు చేశారు. రూ.3,780 కోట్ల వ్యయంతో హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి కేవలం 190 రోజుల్లోనే 40 టీఎంసీల నీటిని తరలించిన ఘనత కూటమి ప్రభుత్వానిదని చెప్పారు.

కూటమి ప్రభుత్వ పాలనలో రాయలసీమలోని ప్రాజెక్టులు, చెరువులు కళకళలాడుతున్నాయని తెలిపారు. మొత్తం 464 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి గాను ప్రస్తుతం 366 టీఎంసీల నీటిని నిల్వ చేయగలిగామని అన్నారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దూరదృష్టి, పరిపాలనా సామర్థ్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

1983లో స్వర్గీయ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా రాయలసీమ కరువు సమస్యకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా అడుగులు వేశారని, ఆ సంకల్పాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తున్న నాయకుడు చంద్రబాబు నాయుడని చెప్పారు. తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు--నగిరి, వెలుగోడు, కేసీ కెనాల్, ఎస్ఆర్‌బీసీ, బ్రహ్మసాగర్ వంటి ప్రతి ప్రాజెక్టు వెనుక ఎన్టీఆర్, చంద్రబాబు సంకల్పం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. కానీ జగన్ రెడ్డి కృష్ణా నదిలో మిగులు జలాలు కోరబోమని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు లేఖ రాసి రాయలసీమ రైతుల గొంతు నొక్కారని ఆరోపించారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని పట్టించుకోలేదని, అపెక్స్ కౌన్సిల్‌లో సెక్షన్--3పై వాదనలు వినిపించకుండా రాష్ట్రానికి తీరని నష్టం చేశారని మండిపడ్డారు.

గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో 102 సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేసి సీమను ఎడారిగా మార్చారని విమర్శించారు. అనుమతుల్లేని రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని రూ.3,825 కోట్లతో ప్రారంభించి రూ.900 కోట్లకుపైగా మట్టి పనులకు బిల్లులు చెల్లించుకున్నారని ఆరోపించారు. రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే రాయలసీమకు ఖర్చు చేశారని తెలిపారు. ఇసుక దోపిడీ కారణంగానే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 39 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని అన్నారు. పింఛా డ్యాం దెబ్బతిని అలగనూరు ప్యాకేజీ జలాశయం గట్టులు కుంగిపోవడంతో 2021 నుంచి నీటి విడుదల నిలిచిపోయిందని గుర్తు చేశారు. గాలేరు--నగిరి ప్రాజెక్టుకు కీలకమైన గోరుకల్లు జలాశయాన్ని నిర్లక్ష్యం చేసి ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. తుంగభద్ర డ్యాం 19వ క్రెస్ట్ గేట్లు కొట్టుకుపోయినప్పుడు కూటమి ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకుని కేవలం ఐదు రోజుల్లో మరమ్మత్తులు పూర్తి చేసి సుమారు 40 టీఎంసీల నీటిని కాపాడిందని చెప్పారు. ప్రతి సంవత్సరం సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని ఎత్తిపోతల ద్వారా నియంత్రించి రాయలసీమ శాశ్వత అవసరాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇలాంటి ఘన చరిత్ర కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమను ఎడారిగా కాకుండా 'రత్నాల సీమ'గా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని కేకే చౌదరి స్పష్టం చేశారు.

## గుండాలకోన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- సమన్వయంతో పనిచేయాలి: ఆర్‌డీఓ బి. రామమోహన్




**రైల్వే కోడూరు ప్రతినిధి, జనవరి 4 (డ్రీమ్ టైమ్స్):** చిట్వేల్ మండలం గుండాలకోనలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తిరుపతి డివిజన్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ బి. రామమోహన్ సూచించారు. ఈ మేరకు బుధవారం చిట్వేల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌డీఓ బి. రామమోహన్ అధ్యక్షతన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుండాలకోనలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 14, 15, 16 తేదీలలో జరగనున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖలు తమ తమ బాధ్యతలను గుర్తించి ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. భక్తులకు త్రాగునీటి సౌకర్యం, పారిశుధ్య నిర్వహణ, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, రహదారి సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతలు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అటవీ ప్రాంతంలో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో తహసీల్దార్ చిట్వేల్, ఎంపీడీఓ చిట్వేల్, ఎస్‌హెచ్‌ఓ చిట్వేల్, కోడూరు సీఐ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఆలయ అధికారులు, దేవాలయ చైర్మన్, ఏఈ (ఆర్‌డబ్ల్యూఎస్), ఏఈ (పీఆర్), వైద్యాధికారి, ఈఓ (పీఆర్ ఒ ఆర్‌డీ), ఏపీఓ (ఎంజీఎన్‌రెగ్స్), ఏపీఎం (వెలుగు), ఇంజినీరింగ్ సూపర్‌వైజర్, నగరిపాడు వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మట్టిలో మాణిక్యం... సి.వి. రామన్ యంగ్ జీనియస్

# గోల్డ్ మెడల్ సాధించిన చిట్వేల్ విద్యార్థి




**రైల్వే కోడూరు ఫిబ్రవరి 4 (డ్రీమ్ టైమ్స్)** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొన్న సర్ సి.వి. రామన్ యంగ్ జీనియస్ అవార్డులు -- 8వ తరగతి టాలెంట్ టెస్ట్ పరీక్షల్లో చిట్వేల్ మండలం కే. కందులవారిపల్లికి చెందిన ఏదోటి జ్వలిత్ చౌదరి అద్భుత ప్రతిభను కనబర్చి బంగారు పతకం సాధించాడు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక రవీంద్ర భారతి ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే చెంతమేనేని ప్రభాకర్, చైర్మన్ కిరణ్, సినీ హీరో శ్రీకాంత్, నటుడు శివాజీ రాజా ల చేతుల మీదుగా జ్వలిత్ చౌదరికి గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. చిట్వేల్ మండలం కే. కందులవారిపల్లి గ్రామానికి చెందిన జ్వలిత్, 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు గ్రామ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశాడు. గ్రామీణ వాతావరణంలోనే చదువుకున్నప్పటికీ, చిన్ననాటి నుంచే చూపిన ప్రతిభను గమనించిన తల్లిదండ్రులు, మెరుగైన విద్య కోసం అతడిని తిరుపతికి తరలించారు. తండ్రి ఏదోటి రాజశేఖర్ నాయుడు తన కుమారుడిని తిరుపతి బీవీకె స్కూల్లో చేర్పించారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న జ్వలిత్, యంగ్ జీనియస్ టాలెంట్ టెస్ట్‌లో సత్తా చాటి రాష్ట్రాల స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం గమనార్హం. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ విద్యార్థి నిజంగానే "మట్టిలో మాణిక్యం"గా నిలిచాడని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కు పంపిణీ..

నలకదొడ్డి టిడిపి గ్రామ అధ్యక్షుడు చొరవతో చెక్కు తీసుకున్న బాధ్యుడు బోయ అంజి




**పత్తికొండ ఫిబ్రవరి 4 (డ్రీమ్ టైమ్స్)** అనారోగ్యరీత్యా బాధపడుతున్న హాస్పిటల్ కోసం అప్పులు తీసుకొని ఆరోగ్యం బాగు కొరకు చూపించుకొని ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కె.ఈ.శ్యాంకుమార్ ఆద్వర్యంలో బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పత్తికొండ మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ చొరవతో అదే గ్రామానికి చెందిన బోయ అంజి అనారోగ్య రీత్యా బాధపడుతూ సొంత డబ్బులతో హాస్పిటల్లో చూపించుకునందుకు ఆయనకు ఎమ్మెల్యే ద్వారా 44 వేల రూపాయలు చెక్కు అందుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే కెఈ.శ్యాంబాబు,టిడిపి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోకనాథ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామలింగప్ప.భరత్ కుమార్,రవితేజ తదితరులు పాల్గొన్నారు

# 40 మంది గిరిజనులకు 'ఆధార్' లేక ప్రభుత్వపథకాలకు దూరం.

**రుద్రవరం. ఫిబ్రవరి 4 (డ్రీమ్ టైమ్స్)** రుద్రవరం మండలం చిన్నయ్య స్వామి చెంచుగూడెం గ్రామంలో 60 కుటుంబాలు ఉన్న గిరిజన వాడలో40 మంది చెంచులకు ఆధార్ కార్డు లేక ప్రభుత్వం పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారని రుద్రవరం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా చిన్నయ్య స్వామి చెంచుగూడెంలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమంలో డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని చిన్నయ్య స్వామి చెంచుగూడెంలో గ్రామ ప్రజల అభివృద్ధి ధ్యేయంగా కృషి విజ్ఞాన కేంద్రం యాగంటి పల్లె వారి సహాయ సహకారాలతో పౌల్ట్రీ డెవలప్మెంట్ ద్వారా ఉచితంగా కోళ్లను పంపిణీ చేయాలని చెంచుగూడెం ను సందర్శించి అర్హులైన వారిని ఎన్నుకోవాలని సర్వే చేపట్టామన్నారు. ఇందులో భాగంగా దాదాపు 60 కుటుంబాలు ఉన్న గ్రామంలో సుమారు 40 మంది గిరిజనులకుఆధార్ కార్డులు లేవని మా సర్వేలో తేలిందన్నారు. వీరికి ప్రభుత్వ నుండి వచ్చే




పథకాలు అందగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. మేము చేపట్టిన పౌల్ట్రీ డెవలప్మెంట్ కార్యక్రమానికి ముఖ్యంగా ఆధార్ కార్డు ఉన్నవారే అర్హులు కాబట్టి వారు కచ్చితంగా ఆధార్ కార్డు పొందాలని త్వరలో గిరిజన కుటుంబాలఅభివృద్ధికి మేలు జాతి కోళ్లను పంపిణీ చేయాలనే దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కనుక ఆధార్ కార్డు లేని ప్రతి ఒక్కరు సంబంధిత అధికారుల దగ్గరికి వెళ్లి వెంటనే ఆధార్ కార్డు పొందాలని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ దుర్గాప్రసాద్, ఏ హెచ్ ఏ బాలు నాయక్, అధిక సంఖ్యలో చిన్నయస్వామి చెంచుగూడెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రీసైకిలింగ్ ఆర్ట్స్ చేసే వారిని ప్రభుత్వం ప్రోత్సహించాలి



**బనగానపల్లె ఫిబ్రవరి 4 (డ్రీమ్ టైమ్స్)** రీసైకిలింగ్ ఆర్ట్స్ చేసే వారిని ప్రభుత్వం ప్రోత్సహించాలని శ్రీ జే కే ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మనంద ఆచారి పేర్కొన్నారు బుధవారం మండలంలోని పలుకూరు గ్రామంలో శ్రీ జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జె ఎస్ ఎస్ బ్రహ్మనంద ఆచారి ఆధ్వర్యంలో రీసైకిలింగ్ ఆర్ట్స్ ద్వారా పర్యావరణహితం కోసం కృషి చేస్తున్న బనగానపల్లె పట్టణానికి చెందిన ఫణీంద్ర కుమార్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బ్రహ్మనంద ఆచారి మాట్లాడుతూ రీసైకిలింగ్ ఆర్ట్స్ చేసేవారిని ప్రభుత్వం, దాతలు ప్రోత్సహించాలన్నారు. సన్మాన గ్రహీత ఫణింద్ర కుమార్ మాట్లాడుతూ దాతలు, ప్రభుత్వం ప్రోత్సహిస్తే రీసైకిలింగ్ ఆర్ట్స్ లో అనేక కళాఖండాలను సృష్టిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్ రెడ్డి, సైకిల్ షాప్ భాషా, కే.ఈ. వెంకటసుబ్బయ్య గౌడ్ ,కరెంట్ రాజు, భాష ,నాగన్న తదితరులు పాల్గొన్నారు.

